RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:85 | మార్చి 13, 2026 | వెల: రూ.3-00


## ఎల్‌పీజీ కొరతపై కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలి



- హోటళ్లు, చిన్న వ్యాపారాలు సంక్షోభంలో ఉన్నాయి
- సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి
- కేంద్ర మంత్రికి కేటీఆర్ లేఖ

2లో





# ఇరాన్ vs అమెరికా

- అగ్రరాజ్య టెక్ సంస్థలే లక్ష్యంగా ఇరాన్ హెచ్చరిక
- ముదురుతున్న యుద్ధ సెగ..
- గూగుల్, మైక్రోసాఫ్ట్ కార్యాలయాలకు ముప్పు
- చమురు మార్గాల్లో క్షిపణి దాడులు..
- పశ్చిమాసియాలో పతాక స్థాయికి చేరిన ఉద్రిక్తతలు

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ మరియు అమెరికా–ఇజ్రాయెల్ కూటమి మధ్య పోరు ప్రపంచం మూడో ప్రపంచ యుద్ధం ముంగిట నిలిచినట్లు కనిపిస్తోంది. కేవలం భూమి, ఆకాశ మార్గాల్లోనే కాకుండా.. ఇరాన్ ఇప్పుడు సరికొత్తగా డిజిటల్ యుద్ధానికి తెరలేపింది. ఇజ్రాయెల్‌కు సాంకేతిక సహకారం అందిస్తున్న గూగుల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా వంటి దిగ్గజ టెక్ సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ చేసిన హెచ్చరికలు ఇప్పుడు గ్లోబల్ టెక్ మార్కెట్‌ను వణికిస్తున్నాయి. ఒకవైపు డ్రోన్లు, క్షిపణులతో బాగ్దాద్ నుంచి టెల్ అవీవ్ వరకు ఇరాన్ విరుచుకుపడుతుంటే.. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరిస్తోంది. చమురు రవాణాను అడ్డుకుంటే తీవ్ర ప్రతీకారం తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం, ఇప్పటికే ఇరాన్‌కు చెందిన 16 నౌకలను అమెరికా ధ్వంసం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భౌతిక దాడుల నుంచి సైబర్ దాడుల వరకు.. గగనతలం నుంచి డిజిటల్ ప్రపంచం వరకు విస్తరించిన ఈ పెను యుద్ధం.. అంతర్జాతీయ మార్కెట్లు, ముడిచమురు ధరలపై ఎలాంటి ప్రభావం చూపబోతోంది?

## గ్యాస్ కొరతపై అపోహలు వద్దు

### ప్రధాని మోదీ హెచ్చరిక

- ఇరాన్ యుద్ధం ప్రభావంపై కేంద్రం అప్రమత్తం
- అపోహలు వ్యాప్తి చేసే వారిపై నిఘా
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమని ధీమా

2లో



## పేదల ఆత్మగౌరవమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో పర్యటన

2లో



## ప్రేమ పేరుతో బాలికలపై అఘాయిత్యం



- బాలిక గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి
- ఆస్పత్రిపై కూడా విచారణకు ఆదేశాలు

2లో

## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు ముగింపు



2లో

- సుప్రీంకోర్టులో కేసు డిస్పోజ్
- రెండు రోజుల్లో ప్రచురించాలని ఆదేశం
- పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్



## 1.15 కోట్ల కుటుంబాలకు బీమా

- మహిళా సంఘాలకు డిజిటల్ హెల్త్ కార్డులు
- విద్య, వైద్యం రంగాల్లో సంస్కరణలకు శ్రీకారం
- సీఎం రేవంత్ రెడ్డి
- కోకాపేటలో మెడికవర్ ప్రారంభం

2లో

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా మరియు ఆరోగ్య భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్త సవాలుగా తీసుకుందని పేర్కొన్నారు. పేదలకు సరైన విద్య, వైద్యం అందించినప్పుడు దాదాపు 90 శాతం సమస్యలు పరిష్కారం

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

శుక్రవారం | మార్చి 13, 2026

# 1.15 కోట్ల కుటుంబాలకు బీమా

మొదటి పేజీ తరువాయి

అవుతాయని ఆయన చెప్పారు. హైదరాబాద్ కోకాపేట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ పథకాల కింద పేదల వైద్యం కోసం రూ.1800 కోట్లను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి ఉస్మానియా, వరంగల్ టిమ్స్, అల్వాల్ టిమ్స్, ఎల్బీనగర్ టిమ్స్, సనత్ నగర్ టిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో 10 వేల పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే విద్యా రంగంలో సంస్కరణలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందించే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు కార్పొరేట్ పాఠశాలల తరహాలో ఉచితంగా లేదా సగం ఖర్చుతో రవాణా సౌకర్యం కల్పించాలనే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అలాగే యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు సామాజిక బాధ్యతగా సంవత్సరంలో కనీసం ఒక నెల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించాలని సీఎం సూచించారు. వైద్యం కేవలం వృత్తి మాత్రమే కాకుండా మానవత్వంతో కూడిన సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జైయవీర్ రెడ్డి, నవీన్ యాదవ్, మెడికవర్ ఆసుపత్రి చైర్మన్ అనిల్ కృష్ణ, వైద్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు ముగింపు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుకు సుప్రీంకోర్టులో ముగింపు పలికింది. గురువారం ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా స్పీకర్ చర్యలు తీసుకోవాలని గతంలో కోర్టు సూచించినప్పటికీ నిర్ణయం ఆలస్యం అవుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం చివరకు కేసును ముగించినట్లు ప్రకటించింది. ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం విచారించింది. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ వ్యవహారం సభాపతి కార్యాలయంలోనే ముగిసిందని తెలిపారు. స్పీకర్ తరఫు వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ఇకపై ఈ కేసుపై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. ఇప్పటికే స్పీకర్ తుది నిర్ణయం తీసుకున్నందున కేసును డిస్పోజ్ చేస్తున్నట్లు వెల్లడించింది. అలాగే స్పీకర్ జారీ చేసిన ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని కోర్టు ఆదేశించింది. అదే విధంగా పిటిషనర్లకు అవసరమైన సంబంధిత పత్రాలను నాలుగు రోజుల్లో అందజేయాలని కూడా న్యాయస్థానం సూచించింది. దీంతో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పది మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లయింది. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# ఎల్‌పీజీ కొరతపై కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలి

- హోటళ్లు, చిన్న వ్యాపారాలు సంక్షోభంలో ఉన్నాయి
- సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి
- కేంద్ర మంత్రికి కేటీఆర్ లేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణలో ఎల్‌పీజీ సిలిండర్ల కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్రంలో వాణిజ్య మరియు గృహ అవసరాల ఎల్‌పీజీ సిలిండర్ల తీవ్ర కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి సమగ్ర లేఖ పంపించారు. గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, హాస్టళ్లు మరియు చిన్న తరహా ఆహార వ్యాపారాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. గ్యాస్ సరఫరా తక్షణమే పునరుద్ధరించకపోతే హైదరాబాద్ మరియు తెలంగాణవ్యాప్తంగా దాదాపు 90 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు వచ్చే 48 గంటల్లో మూతపడే ప్రమాదం ఉందని తెలంగాణ హోటల్ అసోసియేషన్ హెచ్చరించినట్లు తెలిపారు. ఐటీ కారిడార్‌లోని పీజీ హాస్టళ్లలో నివసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు భోజనం దొరకని పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కేటాయింపుల్లో పెద్ద సంస్థలకన్నా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్యాస్ లభ్యతపై ప్రజల్లో ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు జిల్లా స్థాయి పంపిణీ వివరాలతో పబ్లిక్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ కోరారు. అలాగే సంక్షోభం ముగిసే వరకు వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల సిలిండర్లను అక్రమంగా మళ్లిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీజీ హాస్టళ్లు, గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికలను అవసర సేవలుగా గుర్తించి నిరంతర సరఫరా అందించాలని కోరారు. హోటల్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత కల్పించేందుకు అవసరమైతే సహాయక నిధి ఏర్పాటు చేయాలని కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఇరాన్ వర్సెస్ అమెరికా

- అగ్రరాజ్య టెక్ సంస్థలే లక్ష్యంగా ఇరాన్ హెచ్చరిక
- ముదురుతున్న యుద్ధ సెగ..
- గూగుల్, మైక్రోసాఫ్ట్ కార్యాలయాలకు ముప్పు
- చమురు మార్గాల్లో క్షిపణి దాడులు..
- పశ్చిమాసియాలో పతాక స్థాయికి చేరిన ఉద్రిక్తతలు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మండుతున్నాయి. ఇరాన్ మరియు అమెరికా–ఇజ్రాయెల్ కూటమి మధ్య పోరు 12వ రోజుకు చేరుకోవడంతో పరిస్థితి అత్యంత భయానకంగా మారింది. తాజాగా ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ జారీ చేసిన హెచ్చరికలు ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్నాయనే నెపంతో అమెరికాకు చెందిన దిగ్గజ టెక్ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా వంటి సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలోని క్లౌడ్ సేవల కేంద్రాలకు కిలోమీటరు పరిధిలో ప్రజలు ఎవరూ ఉండవద్దని హెచ్చరించడం దాడుల తీవ్రతకు సంకేతంగా కనిపిస్తోంది.

### డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతున్న ఇరాన్

బుధవారం తెల్లవారుజామున బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రంపై ఇరాన్ ఆరు డ్రోన్లతో దాడికి తెగబడింది. రక్షణ వ్యవస్థలు ఐదింటిని అడ్డుకున్నప్పటికీ, ఒక డ్రోన్ తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. దీనికి కొనసాగింపుగా ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికాదళ స్థావరం కూడా ఈ దాడుల లక్ష్యంగా మారడం గమనార్హం. ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ భూభాగంపై వైమానిక దాడులను ముమ్మరం చేశాయి.

### చమురు రవాణాపై ఉచ్చు.. అమెరికా ప్రతీకారం

ప్రపంచ ఇంధన అవసరాలకు కీలకమైన హార్ముజ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించడం అంతర్జాతీయ మార్కెట్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. సముద్ర మార్గంలో మైన్లను అమర్చి చమురు నౌకలను నిలిపివేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. చమురు సరఫరాకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని, ఇప్పటికే ఇరాన్‌కు చెందిన 16 నౌకలను ధ్వంసం చేసినట్లు అమెరికా నావికాదళం ప్రకటించింది. ఈ పరిణామాలతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా గగనానికి చేరుతున్నాయి.

### డిజిటల్ మౌలిక సదుపాయాలపై గురి

కేవలం భౌతిక దాడులకే పరిమితం కాకుండా, ఇరాన్ ఇప్పుడు టెక్ వార్ కు తెరలేపింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఒరాకిల్ వంటి సంస్థల డేటా సెంటర్లు తమపై జరుగుతున్న దాడులకు సాంకేతికతను అందిస్తున్నాయని ఐఆర్జీసీ ఆరోపిస్తోంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై కూడా సైబర్ మరియు భౌతిక దాడులు చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యుద్ధం కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా డిజిటల్ ప్రపంచాన్ని కూడా తాకడం గమనార్హం.

# పేదల ఆత్మగౌరవమే ప్రభుత్వ లక్ష్యం



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**

- అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో పర్యటన

పేద ప్రజలు ఆత్మగౌరవంతో, ఆనందంగా జీవించాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ఆశయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, గట్టుసింగారం వద్ద 100 పడకల ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. పాలేరు లేక్ వద్ద రూ. 5 కోట్లతో చేపట్టనున్న పర్యాటక సౌకర్యాల అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ నిర్వహించారు. పర్యాటకులు, స్థానిక ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా సరస్సును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. లేక్ వద్ద చేపట్టే పనుల ప్రణాళికను పరిశీలించి, నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మల్లాయిగూడెం గ్రామం నుండి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు రూ.1.35 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. రాబోయే వర్షాకాలం లోపే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కీలక ప్రకటనలు చేశారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం తప్పనిసరిగా మంజూరు చేస్తుందని భరోసా ఇచ్చారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీతో పాటు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని వివరించారు. గట్టుసింగారంలో పట్టాలు లేని నిరుపేదలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, తక్షణమే వారికి పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా బోర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రామాలకు గత నెలన్నర రోజులలో భారీగా నిధులు విడుదలయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

# ప్రేమ పేరుతో బాలికలపై అఘాయిత్యం

- బాలిక గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి
- ఆస్పత్రిపై కూడా విచారణకు ఆదేశాలు



**వేదన్యూస్, నాగర్‌కర్నూలు**

ప్రేమ పేరుతో మైనర్ బాలికలను మోసం చేసిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో కలకలం రేపింది. కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థి పలువురు బాలికలను ప్రేమ పేరుతో లొంగదీసుకుని వారిపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో ఒక బాలిక గర్భం దాల్చడంతో విషయం బయటపడింది. బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల సమాచారం ప్రకారం జిల్లాకు చెందిన ఆ ఇంటర్ విద్యార్థి పరిచయమైన మైనర్ బాలికలను ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఈ క్రమంలో ఒక బాలిక గర్భం దాల్చినట్లు తెలిసింది. అనంతరం ఆమెను కొల్లాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి గర్భస్రావం చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందిత విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అతని మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా పలువురు బాలికలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదిలావుండగా బాలికకు గర్భస్రావం చేసినట్లు ఆరోపణలు ఉన్న కొల్లాపూర్‌లోని సాయి కృప ఆస్పత్రిపై కూడా అధికారులు దృష్టి సారించారు. ఈ వ్యవహారంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

# గ్యాస్ కొరతపై అపోహలు వద్దు

## మోదీ హెచ్చరిక

- ఇరాన్ యుద్ధం ప్రభావంపై కేంద్రం అప్రమత్తం
- అపోహలు వ్యాప్తి చేసే వారిపై నిఘా
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమని ధీమా

**వేద న్యూస్, డెస్క్**

ఇరాన్‌లో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని అతిశయోక్తిగా చూపిస్తూ భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని మంత్రులను ఆయన ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో దేశంలోని పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని ప్రధాని మోదీ మంత్రులకు సూచించారు. ఈ అంశంపై ప్రజల్లో అపోహలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరిగే అవకాశాలు ఉన్నందున మంత్రులు కూడా అక్కడ చురుగ్గా ఉండాలని సూచించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కూడా ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఇలాంటి సంక్షోభ సమయంలో ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడినా భారత్ దానిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి బలంగా ఉందని ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఇదిలావుండగా, అంతర్జాతీయ నౌకా రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి అంశంపై కూడా భారత్ పురోగతి సాధించింది. ఈ సముద్ర మార్గం ద్వారా నౌకల రాకపోకలకు సంబంధించిన అంశంపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఇరాన్ ప్రతినిధి అబ్బాస్ అరఘ్చితో చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం భారత జెండా కలిగిన ట్యాంకర్లకు హార్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణానికి ఇరాన్ అనుమతి ఇచ్చింది. ఇప్పటికే కొన్ని భారతీయ ట్యాంకర్లు ఆ మార్గం ద్వారా సురక్షితంగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం. దీంతో ముడి చమురు రవాణాపై ఉన్న ఆందోళనలు కొంతవరకు తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.



వేద న్యూస్

శుక్రవారం మార్చి 13, 2026

## చైతన్యం ద్వారానే వినియోగదారుల మోసాలను అరికట్టవచ్చు

**– కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**వేద న్యూస్,హనుమకొండ :**

ప్రపంచ వినియోగ దారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ రచించిన వినియోగదారుల హక్కుల చైతన్య కర పత్రిక ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆవిష్కరించారు. రతన్ సింగ్ ఠాగూర్ గత 40 సంవత్సరాలుగా వినియోగ దారుల హక్కుల కోసం ఎన్నో చైతన్య వంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈనాటి ఈ కరపత్రంలో ,"వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2009" వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం మోస మోసపూరిత ప్రకటనలు (ఇందులో పాల్గొన్న సెలబ్రిటీలపై జరిమానా మరియు జైలు శిక్ష తదితరాంశాలు) హానికరమైన కల్తీలు ,ఆన్లైన్ విక్రయాలు మరియు మోసాలను వినియోదారులు ఈ చట్టం ద్వారా తమకు తాము ఎలా కాపాడుకోవాలో సవివరంగా ఈ కరపత్రంలో రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి మరియు స్టేట్ కన్స్యూమర్ క్లబ్స్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, విజిలెన్స్ కమిటీ మెంబర్ బండ కాళిదాస్, కన్స్యూమర్ ఆక్టివిటీస్ డాక్టర్ జగదీష్ ప్రసాద్,రాజు తదితరులు పాల్గొన్నారు.



## మెట్పల్లి ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ ప్రారంభం




**వేద న్యూస్, మెట్ పల్లి**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్థానిక మున్సిపల్ చైర్మన్ లింబాద్రి గారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో బాలికలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి అర్హత గల బాలిక ఈ వ్యాక్సిన్ తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ అంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. హెచ్‌పీవీ వ్యాక్సిన్ పై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, 14 సంవత్సరాలు నిండిన ప్రతి బాలిక తప్పకుండా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాక్సిన్ కొత్తది కాదని, చాలా కాలంగా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో దాదాపు రూ.10 వేల ఖర్చుతో వేయించుకునే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఇప్పుడు ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించుకోవచ్చని డాక్టర్ అంజిత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పీఏ మోహన్ తండ్రి మృతి

**– కుటుంబానికి పరామర్శ**

**వేద న్యూస్, బోయినిపల్లి:**

చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యక్తి గత సహాయకుడు అనంతోజి మోహన్ తండ్రి అనంతో జి రామకృష్ణ ఆచార్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం ఏడవ రోజు పలువురు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబాని కి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమం లో ద్యావ వెంకట్ రెడ్డి, వేద న్యూస్ రిపోర్టర్ మైలారం మహేష్, సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గూడ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ కార్యాలయంలోనే పరిశుభ్రత గల్లంతు

**– లిఫ్ట్ దగ్గర అంతా చెత్తాచెదారం**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లిఫ్ట్ సమీపంలో చెత్త పేరుకుపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రతకు ఆదర్శంగా ఉండాల్సిన చోటే చెత్త కుప్పలు కనిపించడం విమర్శలకు దారి తీస్తోంది. ప్రతిరోజూ తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, ఉద్యోగులు చెత్త దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు గమనించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## ఇంగ్లీష్ భాష కాదు.. జీవనశైలి

**– దైవాల వేణుకుమార్**

**వేద న్యూస్, రామడుగు:**

రామడుగు మండలం వెలిచాల గ్రామంలోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఇంగ్లీష్ క్లబ్ ముగింపు కార్యక్రమానికి అంతర్జాతీయ మెమొరీ ట్రైనర్ దైవాల వేణుకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లీష్ కేవలం ఒక భాష మాత్రమే కాకుండా జీవనశైలిగా మారిందన్నారు. ఆధునిక కాలంలో ప్రపంచంతో అనుసంధానం కావడానికి ఇంగ్లీష్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పరేడ్‌కు అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. ఇంగ్లీష్ క్లబ్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించి, ఇంగ్లీష్ వ్యాకరణ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఉప్పుల శ్రీనివాస్, కో-కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, విశ్వమ్ ఎడ్యుటెక్ రీజినల్ హెడ్ బి. వినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విలాసాగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో మహిళా వైద్యులు, పిల్లల వైద్యులు, కంటి, దంత, ఎముకల నిపుణులు, సాధారణ వైద్యులు పాల్గొని గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వైద్యాధికారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలి

**– ప్రధానోపాధ్యాయురాలు రజిత – పాఠశాలలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం**

**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండలంలోని అసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎన్. రజిత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రోల్ ప్లే నిర్వహించి కిడ్నీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. మానవ శరీరంలో మూత్రపిండాలు అత్యంత ముఖ్యమైన అవయవాలని, రక్తంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపించే పని చేస్తాయని తెలిపారు. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే తగినంత నీరు తాగడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## సారా ప్రాణాలకు ముప్పు

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు
- నాగసాల గ్రామ భీమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి
- కౌన్సిలర్ నవనీత కొండల్



**వేద న్యూస్, జడ్చర్ల:**

సారాయి విక్రయాలు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయని జడ్చర్ల మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ నవనీత కొండల్ అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సారాయి వ్యాపారం ప్రారంభించాలని చేసిన వ్యాఖ్యలపై గురువారం ఆమె ఒక ప్రకటనలో స్పందించారు. గతంలో సారాయి కారణంగా అనేక కుటుంబాల్లో కలహాలు జరిగి భార్యాభర్తలు విడిపోయిన సంఘటనలు, మరణాల ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. మళ్లీ సారాయి విక్రయాలు ప్రారంభిస్తే ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. గిరిజనుల అభివృద్ధి కోరుకుంటే ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి వారి జీవనోపాధి మెరుగుపరచాలని సూచించారు. అలాగే జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల గ్రామానికి చెందిన భీమేష్ (32) మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఏ రంగం ఎంచుకున్నా నంబర్ వన్ కావాలి

**– డిప్యూటీ కలెక్టర్ పుల్లూరి జగదీశ్వర్ రావు**

**వేద న్యూస్, చొప్పదండి:**



పెద్దపల్లి జిల్లా వడ్కాపూర్‌కు చెందిన ఖమ్మం డిప్యూటీ కలెక్టర్ పుల్లూరి జగదీశ్వర్ రావు తాను చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడ్కాపూర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం విద్యార్థులకు సాంకేతిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. విద్యార్థులు ఏ రంగం ఎంచుకున్నా అందులో నంబర్ వన్‌గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం

**వేద న్యూస్, చొప్పదండి:**



మండలం లోని వెదురుగట్ట గ్రామం రామ లింగంపల్లిలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవల కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మరియు చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే మూడు సంవత్సరాల లోపు పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ లెవల్ మానిటరింగ్ సపోర్ట్ కమిటీని ఏర్పాటు చేసి చైర్మన్‌గా గ్రామ సర్పంచ్ పెంచాల శ్రీనివాస్, సభ్యులుగా మారం సమత, మారం ఐలయ్య, కొమ్ము సుజాతలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నర్సింగ్ రాణి, ఎన్ఎమ్ లక్ష్మి, గ్రామ కార్యదర్శి శిరీష్, సూపర్‌వైజర్ నశ్రత్, ఆశా వర్కర్ మంజుల, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేదెప్పుడో..?

**– తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు..!**

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామ శివారు నుండి పంట పొలాలకు వెళ్లే మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్థానిక మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇంకా ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను ఇంకెప్పుడు పూర్తి చేస్తారని నెల క్రితం పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడంతో మెటల్ రోడ్డుకు సంబంధించిన మెటీరియల్స్ తీసుకువచ్చి రోడ్డుపై వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. ఆ మెటీరియల్స్ ను రోడ్డుకు అడ్డంగా వేయడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెటీరియల్స్ ను రోడ్డుపై వేయడంతో 20 రోజుల్లో వరి పంటలు చేతికొస్తాయని, వరి కోత మిషన్లు, లారీలు పొలం వద్దకు రావడానికి మరింత ఇబ్బంది ఎదురవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనుల పై కాంట్రాక్టర్ ఎందుకింత నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అర్థం కాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

# ఆడిట్ కమిటీ సమావేశం

**వేద న్యూస్, మందమర్రి :**




మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ ఓ టు జీఎం జి ఎల్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఏరియాకు సంబంధించిన ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఇంటర్నల్ కమిటీ సభ్యులైన డి. దామోదర్ రావు, ఇంటర్నల్ ఆడిట్, 2025-26 ఆర్థిక సంవత్సరం వివరాలను మందమర్రి ఏరియా ఉన్నతాధి కారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆడిట్ రికవరీలు, పెండింగ్ ఆడిట్ మెమోలపై సమీక్ష హౌస్ బిల్డింగ్ లోన్ ఇంట్రెస్ట్ రియంబర్స్మెంట్ స్కీమ్ క్లెయిమ్ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జ, డీ.జీ.ఎం పర్సనల్ అశోక్, ఇంటర్నల్ ఆడిట్ కమిటీ సభ్యులు డి.దామోదర్ రావు, సరిత, ఫైనాన్స్ మేనేజర్, సివిల్ ఎస్.ఈ శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులు జె.శేషు కుమార్ సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్, ఉదయ్ కిరణ్, డి రాజశేఖర్ జూనియర్ అకౌంటెంట్, మందమర్రి ఏరియా అన్ని గనుల డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

**వేద న్యూస్, చందుర్తి:**



చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన మంజెల లస్మయ్య పూరి గుడిసె అగ్నిప్రమాదంలో దగ్ధమై కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో హరిహర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సహాయం అందించారు. గురువారం ట్రస్ట్ తరపున బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం పంపిణీ చేసి పరామర్శించారు. ఈ ఘటనలో కుటుంబం సర్వం కోల్పోయిందని, మానవత్వంతో ముందుకు వచ్చి వారికి సహాయం చేయాలని ట్రస్ట్ సభ్యులు ప్రజలను కోరారు.

# పాఠశాలకు నీటి శుద్ధి యంత్రం వితరణ

**వేద న్యూస్, రామడుగు:**



మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన ఎన్నారైలు తౌట్ అజిత్ రెడ్డి, పబ్బతి శ్యామ్ కుమార్ రెడ్డి సహకారంతో యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ కుమార్ చొరవతో రూ.25 వేల వ్యయంతో కొనుగోలు చేసిన నీటి శుద్ధి యంత్రాన్ని గురువారం గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ వేముల కుమార్, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్ పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపూర్వకంగా చదవాలి

**– అలా అయితేనే ఉన్నత శిఖరాలకు**

**– దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సూచన**

**వేద న్యూస్, దేవరకద్ర:**




విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టపూర్వకంగా చదివితేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. దేవరకద్ర మండలంలోని డోకూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎంఈఓ బలరాం, హెచ్ఎం, ఉపాధ్యాయులు మరియు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పరీక్షలను భయపడకుండా ప్రశాంతంగా రాయాలని, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ

**వేద న్యూస్, పోతంగల్ :**



మండలంలోని జల్లపల్లి ఓల్డ్ విలేజ్ గ్రామంలో స్థానిక సర్పంచ్ సుంకు లత రవీందర్ స్థానిక నాయకులతో కలసి గురువారం భూమి పూజ చేశారు. గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 20 లక్షల నిధులతో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సికిందర్, పి ఆర్ ఏ ఈ సాయిలు,కార్యదర్శి రాజలింగం,వార్డ్ సభ్యులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు ఉచిత గాలికుంటూ వ్యాధి టీకాలు



**వేద న్యూస్, కోటగిరి :** కోటగిరి మండల కేంద్రంలోని వల్లభాపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు ఉచితంగా గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ రొట్టె పుష్పవతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్, పశువుల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం మార్చి 13, 2026

# విద్యార్థుల ప్రాణాలతో 'శ్రీవాణి' చెలగాటం

- పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకటపూర్ – తిప్పాపూర్ గ్రామాల వద్ద శ్రీవాణి ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి పొలంలోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. డ్రైవర్ తరచుగా వేగంగా బస్సు నడుపుతున్నాడని ఇప్పటికే పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల భవనం కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించబడిందని, చుట్టూ సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదులు కూడా ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పాఠశాల బస్సులకు సరైన అనుమతులు ఉన్నాయా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని, విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పీజీ సీట్లు సాధించిన వైద్యులకు ఘన సన్మానం

**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్, డాక్టర్ మానస పీజీ సీట్లు సాధించిన సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఉన్నత చదువుల నిమిత్తం బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందమర్రి ప్రజలకు వారు అందించిన వైద్య సేవలను గుర్తు చేశారు. పీజీ సీట్లు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు వైద్యులకు తీపి పదార్థం తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి అబ్బాస్, బర్ల సదానందం, వేముల నర్సయ్య, సాగర్ బాబు, మజారు, సలవుద్దిన్, నోముల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో చిరుజీవులను కాపాడుకుందాం

**– కేయూ పాలక మండలి సభ్యురాలు డా.అనితా రెడ్డి**



**వేద న్యూస్, హనుమకొండ:**

వేసవికాలంలో పక్షులు, చిరుజీవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఇంటి ఆవరణలో పక్షులకు గింజలు, నీటి పాత్రలు ఏర్పాటు చేయాలని, చిన్న చిన్న గూళ్లు కట్టడం ద్వారా వాటిని రక్షించవచ్చని ఆమె సూచించారు. అడవులు తగ్గిపోవడం, చెట్లు లేకపోవడం వల్ల పక్షులు, చిరుజీవులు కనుమరుగ వుతున్నాయని తెలిపారు. వేసవి తీవ్రతను తట్టుకోలేక పక్షులు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నాయని, వాటికి నీరు, ఆహారం అందించడం మానవత్వానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా కొందరికి పిట్ట గూళ్లు, గింజలను పంపిణీ చేశారు.

# ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం

**– ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**వేద న్యూస్, శాయంపేట:**

ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. అప్పయ్య, మండల వైద్యాధికారి డా. సాయి కృష్ణ, మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మారపెల్లి రవీందర్, సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సర్పంచులకు శిక్షణ

**– పాల్గొన్న మంత్రి కొండా సురేఖ**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణపై సర్పంచులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవలపై వివరించారు. ఈ సందర్భంగా రంగాపురం సర్పంచ్ ఓరుగంటి మాధురి, కన్నారావుపేట సర్పంచ్ మూర్తిలకు మంత్రి కొండా సురేఖ అధికారిక ఐడీ కార్డులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు.

# నో స్మోకింగ్ డే సందర్భంగా అవగాహన సదస్సు



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

నో స్మోకింగ్ డే సందర్భంగా వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, గర్భధారణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ధూమపానం చర్మ సమస్యలు, దంత సమస్యలకు కూడా కారణమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రవణ్, మోహన్, రామ శ్రీనివాస్, సురేందర్, మహేందర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేయాలి

**– కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి**



**వేద న్యూస్, శాయంపేట:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శాయంపేట మండల కాంగ్రెస్ కార్యాలయంలో మాందారిపేట మహిళా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా కోరే లలిత, ఉపాధ్యక్షురాలిగా మిద్దెపాక మాధవి, ప్రధాన కార్యదర్శిగా బడుగు సునీత, కోశాధికారిగా కూతురు నీలమ్మ, సహాయ కార్యదర్శిగా వల్లెపు శిరీషలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలకు రూ.2 లక్షల విలువైన డెస్కుల అందజేత



**వేద న్యూస్, గీసుకొండ:**

గీసుకొండ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.2 లక్షల విలువైన 40 డ్యుయల్ డెస్కులను సామాజిక సేవకుడు పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సహకారంతో ఈ డెస్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పెరకవాడ స్కూల్లో మోటివేషన్ మాక్ పోలింగ్

**– జీవిత లక్ష్యాలకు ఓట్లు వేసిన టెన్త్ విద్యార్థులు**



**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ నగరంలోని అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలోని పెరకవాడలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రైల్వే గేట్)లో వినూత్నంగా మోటివేషన్ మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్, బిసిటియు వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. టెన్త్ క్లాస్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల్లో లక్ష్య సాధనపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ పోలింగ్ నిర్వహించినట్లు సాంబమూర్తి తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో డాక్టర్, పోలీస్, ఇంజినీర్, కలెక్టర్ వంటి లక్ష్యాల గుర్తులు ముద్రించి విద్యార్థులతో ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. తమ జీవిత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి ఓట్లు వేయడం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఈ మాక్ పోలింగ్‌లో రిటర్నింగ్ ఆఫీసర్‌గా కే. సిద్ధార్థ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా బి. తరుణ్, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఎస్. వరుణ్ సాయి, పోలింగ్ ఆఫీసర్లుగా అంజలి, అలాగే 9వ తరగతి విద్యార్థులు స్వస్తిక, సంజన, భవాని తదితరులు పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించారు. టెన్త్ తరగతి విద్యార్థులు తమ ఓటును వినియోగించుకున్నారు.

# మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చిదిద్దుతాం

**– మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... పేదరికం ఆసరా చేసుకొని ధనార్జన కోసం దళారులను అడ్డుపెట్టి ఇతర జిల్లా, రాష్ట్రాల వారిని రెచ్చగొట్టి ఫేక్ డాక్యుమెంట్ లతో భూమి పేదలకు మోసపూరితంగా అప్పగించారని తెలిపారు. 1953 లో ఆసామి 31 ఎకరాల 7 గుంటల భూమి దానం చేశారని తెలిపారు. గత 8 సంవత్సరాల కాలంలో అనేక సమస్యలు పేదలు ఎదుర్కొన్నారని, త్రాగునీటి, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పన లేకుండా బాధలు పడ్డారని తెలిపారు. కరెంట్, మంచి నీరు ప్రతి అంశానికి డబ్బులు డిమాండ్ చేస్తూ మాఫియా నడిపించారని మంత్రి తెలిపారు. పేదలను దిన దిన గండం నుంచి కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని అన్నారు. భూదాన్ భూములు ఆక్రమించుకోవాలని సిసిఎల్ఏ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయని అన్నారు. మోడల్ కాలనీగా వెలుగు మట్లను తీర్చి దిద్దుతామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన తల్లి సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9 నాటికి కాలనీ పూర్తి చేస్తామని తెలిపారు.



పేదలకు పంచిన తర్వాత మిగిలిన భూమిలో స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిరుపేదలకు సున్నా వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు. పేదలకు ఇంటి నిర్మాణంలో హౌసింగ్ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. వెలుగుమట్ల లేఔట్ లో కరెంటు పోల్స్, విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టాలన్నారు. దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారు వివరాలు పోలీసు అధికారులకు అందించాలని అన్నారు. ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టే సమస్య లేదని కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్
శుక్రవారం మార్చి 13, 2026

# బాబురావు కృషి మరువలేనిది

**వేద న్యూస్, కారేపల్లి:**



ప్రజా సేవలో అలుపెరగని యోధులు, మండలంలోని ఇద్దరు ప్రజాప్రతినిధుల మరణం సింగరేణిని దిగ్భ్రాంతికి గురిచేసింది. బోటి తండా సర్పంచ్ బానోత్ తులసిరామ్ మరణం కలిగించిన బాధ నుంచి మండల ప్రజలు బయటపడకముందే, పాత కమలాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ తేజవత్ బాబురావు (బుధవారం రాత్రి) గుండెపోటుతో హఠాన్మరణం చెందడం స్థానికులను తీవ్ర శోకసంద్రంలోకి నెట్టింది. సమాజ సేవలో బాబురావు కృషి మరువలేనిది పాత కమలాపురం అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన బాబురావు, ఈ వయసులోనే ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరి మన్ననలు పొందారు. ఆయన మరణం మండలంలోని కాంగ్రెస్ పార్టీకి మరియు గ్రామస్తులకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. సమాజ సేవ పట్ల ఆయనకున్న అంకితభావం, నిబద్ధత మరువలేనివి. సర్పంచ్ బాబురావు మరణవార్త తెలియగానే మాజీ ఎంపీపీలు బానోత్ దేవ్లా, పగడాల మంజుల, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య తదితరులు హుటాహుటిన చేరుకుని, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గురువారం రోజున బాబురావు స్వగ్రామమైన చీమ్న తండాలో జరిగిన అంత్యక్రియల్లో భారీగా తరలివచ్చిన ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో దుబ్బ తండా గ్రామ అధ్యక్షుడు గుగులోతు రవీందర్, చాగంటి కోటయ్య, గౌడ్ నరసింహారావు, ఆవుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ గుగులోత్ శ్రీను, మండలంలోని నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొని, బాబురావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. స్వల్ప వ్యవధిలోనే మండలంలో ఇద్దరు సర్పంచ్‌లను కోల్పోవడం పట్ల సింగరేణి మండల ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు.

# డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తిని ఘనంగా సన్మానించిన సుధాకర్

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తిని నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు పాగర్తి సుధాకర్, ఇతర నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామంలో గల బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షులు సూరేపల్లి జ్ఞానరత్నం గృహంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ... డాక్టర్ దివ్యమూర్తి చాలా ప్రతిభావంతుడని, తన పరిజ్ఞానంతో అనేకమందిని ముఖ్యంగా యువతని చైతన్యం చేస్తున్నారని, విద్యార్థులలో జ్ఞాపకశక్తి మెలకువలు పెంపొందించే కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు 124 వేదికల మీద సన్మానం జరిగిందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షులు సూరేపల్లి జ్ఞాన రత్నం, మొహినుద్దీన్, రామచంద్రపురం బిజెపి నాయకులు స్వామిదాసు, నేలకొండపల్లి బిజెపి పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి కందరబోయిన గోపి, కట్టెకోల వెంకటేశ్వర్లు, వడ్లమూడి శ్రీనివాసరావు, ఏపూరి ఎల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# బాబురావు సేవలు మరువలేనివి

**వేద న్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండలం పాత కమలాపురం గ్రామపంచాయతీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేజవత్ బాబురావు(48)బుధవారం రాత్రి 10:00 గంటలకు గుండెపోటుతో హఠాన్మరణం చెందడం పట్ల వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్,తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి బాబురావు ఖమ్మం ఆరోగ్య హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారన్న వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ఆసుపత్రిలో ఉంచిన బాబురావు భౌతిక దేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఆయన పార్థివ దేహంపై పూలదండలు ఉంచి ఘన నివాళులు అర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించే బాబురావు లాంటి నిబద్ధత గల నాయకుడిని కోల్పోవడం పార్టీకి, నియోజకవర్గానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపిన ప్రముఖులు ఈ విషాద సమయంలో బాబురావు నివాళులు అర్పించేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివచ్చారు. నివాళులు అర్పించిన వారిలో వడ్డే నారాయణరావు (కొణిజర్ల మండల అధ్యక్షులు), బానోత్ రామ్మూర్తి పమ్మి అశోక్, మల్లెల రవీంద్ర ప్రసాద్, (సింగరేణి మండల ఎంపీపీవో), మరియు ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు. గ్రామానికి వెలికిరాని విషాదం గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన బాబురావు ఆకస్మిక మరణంతో పాత కమలాపురం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఈ కష్టకాలంలో ఆయన కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు.

# ఐదు దశల్లో ప్రగతి ప్రణాళిక అమలు



**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

- స్థానిక సంస్థల పాత్ర కీలకం
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయడంలో సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. గురువారం తంగళ్ళపల్లి మండలం జిల్లెల గ్రామంలోని డా. బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికను ఐదు దశల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి సమావేశాలు, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, మే 22న జిల్లా స్థాయి కార్యక్రమాలు, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 573 ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని, మిగతా ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అలాగే 3.91 లక్షల గ్యాస్ సిలిండర్లను రూ.500కు సరఫరా చేసినట్లు చెప్పారు. 46,492 మంది రైతులకు రూ.370 కోట్లకు పైగా రుణమాఫీ అమలైందని, లక్ష 26 వేల మందికి రైతు భరోసా అందిందని వెల్లడించారు. కొత్తగా 22,554 రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులు, పన్నుల వసూళ్లు, చెత్త వేరు చేసే విధానాన్ని క్రమం తప్పకుండా అమలు చేయాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాల భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి జూన్ 2లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ.25 వేల సహాయం అందిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, మున్సిపల్ చైర్మన్లు, పంచాయతీ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కారేపల్లి ఎస్ఐ గోపి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, కారేపల్లి :**



మండల కేంద్రమైన కారేపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న బైరు గోపి జన్మదిన వేడుకలు గురువారం భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, సూర్యతండా సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్ ల సమక్షంలో కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపి చిరు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ ప్రజా సంరక్షణలో సింగరేణి మండల అభివృద్ధి లో భాగస్వాములు అవుతున్న ఎస్ఐ , మరిన్ని పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, గాంధీ గౌస్,రాంబాబు, ప్రసాద్, శంకర్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# 'డ్రీమ్స్ స్టార్ట్' సందర్శించిన జైకా భారత ప్రతినిధి

**వేద న్యూస్, మంథని:**



జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ జైకా భారత ప్రతినిధి టకూరో టకైచు గురువారం మంథని పట్టణంలోని డ్రీమ్స్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ సెంటర్ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి ఆవిష్కరణలపై ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రోటోటైపులు, సమస్యల పరిష్కారానికి రూపొందించిన వినూత్న నమూనాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణాత్మక ప్రయత్నాలను అభినందించారు. విద్యార్థులు తమ పరిసరాల్లోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించే విధంగా ఈ కేంద్రం పనిచేయడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాత కమలపురం సర్పంచ్ కి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

**వేద న్యూస్, కారేపల్లి :**



మండల పరిధిలోని పాతకమలపురం సర్పంచ్ తేజవత్ బాబురావు బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ గురువారం సర్పంచ్ పార్థీవదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ ధరవత్ పాండ్య నాయక్ ఇంట్లో స్థానిక నాయకులతో కలసి కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు చాగంటి కోటయ్య, అజ్మీర వీరన్న, జర్పుల ప్రసాద్, శంకర్, లచ్చిరాం, బాలు, భావ్సింగ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కళాశాలను సందర్శించిన కలెక్టర్

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**



తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని డా. బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న విద్యా, పరిశోధన కార్యక్రమాలను పరిశీలించి అధికారులు, అధ్యాపకులతో చర్చించారు. ఈ సందర్భంగా సాయిల్ సైన్స్, ఎంటమాలజీ, జెనెటిక్స్ మరియు ప్లాంట్ బ్రీడింగ్ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. మట్టి, నీటి నమూనాల విశ్లేషణ విధానాలు, పంటలకు హానికరమైన కీటకాలను గుర్తించడం, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే మెరుగైన పంట రకాలను అభివృద్ధి చేయడానికి కళాశాలలో జరుగుతున్న పరిశోధన కార్యక్రమాలను అధ్యాపకులు, విద్యార్థులు వివరించారు. అనంతరం మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి విద్యా సదుపాయాలు, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కళాశాల అసోసియేట్ డీన్ సునీత దేవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడి

## – నిందితుడి అరెస్ట్.. పోక్సో కేసు నమోదు

**వేద న్యూస్, చందుర్తి:**

ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని డీఎస్పీ ఎ. శ్రీనివాసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన వాసాల వేణు కుమార్ (36) ఏసీ మెకానిక్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు మైనర్ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జె. రమేష్ నిందితుడిపై కిడ్నాప్ మరియు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జుడీషియల్ రిమాండ్ విధించారు. మహిళలు, మైనర్ బాలికలపై వేధింపులు లేదా లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ యజమానికి అప్పగింత

**– నిజాయితీకి ఎస్ఐ ప్రశంసలు**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**





ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మస్కూరి శ్రీను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి తిరిగి యజమానికి అప్పగించారు. వివరాల ప్రకారం, శ్రీను వ్యక్తిగత పనిమీద మండలంలోని రాజన్నపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అదే సమయంలో ధూమాల గ్రామ బ్రిడ్జి సమీపంలో ఆ ఫోన్ మొగుళ్ల మధుకు దొరికింది. ఫోన్ దొరికిన వెంటనే మధు నేరుగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఫోన్ ద్వారా వివరాలు సేకరించి యజమాని శ్రీనును స్టేషన్‌కు పిలిపించి, ఎస్ఐ రాహుల్ రెడ్డి సెల్‌ఫోన్‌ను ఆయనకు అందజేశారు. దొరికిన సెల్‌ఫోన్‌ను నిజాయితీగా పోలీసులకు అప్పగించి యజమానికి అందేలా సహకరించిన మొగుళ్ల మధును ఎస్ఐ రాహుల్ రెడ్డి అభినందించారు.

## సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టొద్దు

**– ఫేక్ పోస్టులపై పోలీసుల నిఘా – ఎస్ఐ రాహుల్ రెడ్డి హెచ్చరిక**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



సోషల్ మీడియా వేదికల్లో ఫేక్ సందేశాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే లేదా వివాదాస్పద పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా లేదా రాజకీయాలకు సంబంధించిన తప్పుడు సమాచారం, వీడియోలు, సందేశాలను ఎవరూ పోస్ట్ చేయకూడదని సూచించారు. కులం లేదా మతం పేరుతో ఇతరులను దూషించే విధంగా పోస్టులు చేయడం, ఫార్వార్డ్ చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. పోలీసుల సూచనలను పట్టించుకోకుండా ఇలాంటి సందేశాలను గ్రూపుల్లో షేర్ చేసినా లేదా పోస్ట్ చేసినా సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్‌లపై కూడా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఉద్వేగాలకు లోనుకాకుండా సంయమనం పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రాహుల్ రెడ్డి కోరారు.

## హమాలీలకు సమగ్ర చట్టం చేయాలి

**– సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి**



**వేద న్యూస్, దేవరకద్ర:**

లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో పనిచేస్తున్న హమాలీలకు సమగ్ర చట్టం రూపొందించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీల జనరల్ బాడీ సమావేశం సంఘ అధ్యక్షుడు శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమూర్తి మాట్లాడుతూ ఆహార ధాన్యాలు, సిమెంట్, ఇనుము తదితర వాణిజ్య వస్తువుల లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో హమాలీలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి సరైన చట్టపరమైన రక్షణ లేదన్నారు. ప్రమాదాలు జరిగినప్పటికీ నష్టపరిహారం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాచ్యుటీ వంటి సదుపాయాలు అందడం లేదని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ మార్కెట్ యార్డులు, గోదాములు, పరిశ్రమల్లో పనిచేస్తున్న హమాలీలు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీలకు కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వీరనాగూరు కృష్ణయ్య, బలుసుపల్లి కృష్ణయ్య, రాము, శ్రీనివాసులు, హనుమంతు, అంజిదాసు, యాదమ్మ, కురుమమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు..

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన 102 అంబులెన్స్

**– తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. మండలంలోని కొత్త బస్టాండ్ వద్ద 102 అంబులెన్స్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సును ఢీకొట్టింది. సమాచారం ప్రకారం కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు కామారెడ్డి వైపు వెళ్లేందుకు బస్టాండ్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో వేగంగా వచ్చిన 102 అంబులెన్స్ అదుపుతప్పి బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్, బస్సు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. అయితే ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనతో కొంతసేపు బస్టాండ్ పరిసరాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## కొనసాగుతున్న రిజర్వాయర్ వ్యతిరేక ధర్నా

**– 74వ రోజుకు చేరుకున్న అఖిలపక్ష పోరాట సమితి నిరసన**

**వేద న్యూస్, ఏదుల మండలం:**



ఏదుల మండల కేంద్రంలో గొల్లపల్లి –చిరుక్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా అఖిలపక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా 74వ రోజుకు చేరుకుంది. మండుటెండల్లోనూ రైతులు, స్థానికులు నిరసనను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ రిజర్వాయర్ అంశంపై ప్రజల ఆందోళన కొనసాగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. రైతుల సమస్యలను పట్టించుకుని రిజర్వాయర్ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణంపై రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు.

## క్వారీ అనుమతికి వ్యతిరేకంగా 14న నిరసన దీక్ష

**– ఆలయ ఈవోకు హిందూ బంధువుల వినతి**

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**




చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయం పరిసరాల్లో క్వారీకి అనుమతి ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ ఈనెల 14న నిరసన దీక్ష చేపట్టనున్నట్లు హిందూ సంఘాలు, స్వామి భక్తులు తెలిపారు. గురువారం ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేసిన భక్తులు మాట్లాడుతూ.. వేల ఏళ్ల చరిత్ర కలిగిన కురుమూర్తి కొండలు ప్రకృతి సౌందర్యంతో పాటు వన్యప్రాణులకు నిలయంగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో క్వారీ ఏర్పాటు చేసి రాళ్ల తవ్వకం, బ్లాస్టింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలిగే పరిస్థితి ఏర్పడటంతో హిందూ సంఘాలు, భక్తులు, రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టగా అనుమతులు నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడుమళ్లీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా క్వారీపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 14 శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయం వద్ద నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే

## "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక"

**– బీ.సీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన" ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" జూన్ 12 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని, తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతీ శ్రీకాంత్ గౌడ్ అధికారులను కోరారు. గురువారం దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్, బీసీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం అందులో ఒక భాగం అని అన్నారు 99 రోజుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అందరినీ భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిరోజు పార్కులకు వచ్చే వాకర్లు ఈ ప్రత్యేక పరిశుభ్ర కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**పారిశుద్ధ్యానికి మొదటి ప్రాధాన్యం**

వేసవి ప్రారంభమైందని, దీనితో పాటు దోమల బెడద కూడా ప్రారంభమైంది కావున పారిశుద్ధ్య కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రోడ్ల శుభ్రం, డ్రైన్ల శుభ్రం, అంగన్ వాడిలు, మార్కెట్లు, హాస్టళ్ళు, బస్టాండ్లలో శుభ్రత, రోడ్ల వెంట ఖాళీ ప్రదేశాలలో చెట్లపొదలు తొలగింపు, వంటి పనులు ఇందులో భాగం గా ఉంటాయని అన్నారు. రెవిన్యూ ఆగ్ మెంటేషన్ కింద కొత్త ఇండ్లు, పరిశ్రమలు, కమర్షియల్ భవనాల అసెస్మెంట్, ట్రేడ్ లైసెన్స్ జారీ, మార్కెట్లు షాపింగ్ కాంప్లెక్స్ వేలం పూర్తి 100% టాక్స్ ల వసూళ్లు ఇతర ఫీజులు వసూళ్ళు, 2026- 27 సంవత్సరానికి టాక్స్ నిర్ధారణ,పంచాయతీలు, అంగన్ వాడీ భవనాలు, సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులు, చేపడతారని




వివరించారు. తాగునీటికి సంబంధించిన పైపుల రిపేర్, పైపులతో కొత్త కనెక్షన్లు వంటివి గుర్తింపు వాటి రిపేర్లు కొత్త కనెక్షన్లకు మెటీరియల్ సేకరణపై కార్యాచరణ ప్రణాళిక, అధికారులు తయారు చేస్తారని పంచాయతీ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఇతర వనరుల గుర్తింపు పూర్తి చేస్తారని అన్నారు. అన్ని ఇళ్లలో ద్రవ, ఘన, వ్యర్ధాలను విడదీసి సేకరించే పని ప్రతి గ్రామ పంచాయతిది అని కంపోస్టు ఎరువు తయారీ వరద నిర్వహణ పద్ధతులపై శిక్షణ, ఈ వేస్ట్, బయో మెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్, సేకరణ సురక్షితంగా డిస్పోజ్ చేయడం ద్రవ్య వ్యర్థాల నిర్వహణ చర్యలు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల వంటి వాటిని చేపడుతారని పేర్కొన్నారు. ఉపాధి హామీ అమలు తీరు చేపట్టిన పనులను పరిశీలిస్తారని వర్షాకాల సన్నద్ధతలో భాగంగా వరద నీటి కాలువల డిసిల్టింగ్, లోతట్టు ప్రాంతాల ఫీలింగ్ యాంటీ లార్వా కెమికల్స్, ఫాగింగ్ స్ప్రే, శుక్రవారం డ్రై డే పాటింపు, ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం, వాటికోసం స్థలాల గుర్తింపు,మొక్కలు నాటడం వంటి పనులు చెయ్యాలని అన్నారు. నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అనూహ్య స్పందన లభించింది. బీసీ కార్పొరేషన్ కు సంబంధించిన అన్ని పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని, అందుకు కావలసిన కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషనర్ శ్రీమతి బాలమాయాదేవి, ఎండి మల్లయ్య భట్టు, సీఈఓ అలోక్ కుమార్, ఎం.డి.లు ఉదయ్ ప్రకాష్, శ్రీమతి ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

## అనుచరుడి పాడే మోసిన ఎమ్మెల్యే

**– ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**

**వేద న్యూస్, కారేపల్లి:**



రాజకీయాల్లో పదవులు, హోదాలు శాశ్వతం కాదని, కేవలం మనుషుల మధ్య ఉండే అనుబంధాలే శాశ్వతమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నిరూపించారు. తన వెన్నంటి ఉండి నడిచిన ప్రధాన అనుచరుడు, సింగరేణి మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పాత కమలాపురం సర్పంచ్ తేజావత్ బాబురావు ఆకస్మిక మృతి ఎమ్మెల్యేను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బుధవారం రాత్రి గుండెపోటుతో బాబురావు కన్నుమూశారన్న వార్త విన్న వెంటనే ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన, కేవలం నివాళులర్పించి వెళ్ళిపోకుండా.. ఒక కుటుంబ సభ్యుడిలా మారిపోయారు. కన్నీటి పర్యంతమవుతూ తన ప్రియతమ అనుచరుడి పాడేను భుజాన మోసి అంతిమ యాత్రలో ముందుండి నడిచారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. బాబురావు మరణం పార్టీకి మాత్రమే కాకుండా, తనకు వ్యక్తిగతంగా తీరని లోటని పేర్కొన్నారు. కష్టకాలంలో బాబురావు కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అధికార దర్పం ప్రదర్శించకుండా, కడసారి వీడ్కోలులో ఒక సామాన్యుడిలా పాడే మోసిన ఎమ్మెల్యే తీరును చూసి స్థానికులు, కార్యకర్తలు భావోద్వేగానికి లోనయ్యారు. మృత్యువునికి భార్య హైమావతి, ఇద్దరు కుమార్తెలు కుమారుడు శ్రీనివాస్ కు మనో ధైర్యం కల్పించారు.

## కురుమూర్తి సన్నిధిలో తపోవన్ విద్యార్థులు

**వేద న్యూస్, దేవరకద్ర:**



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవాలయంలో తపోవన్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులు స్వామివారి ఆశీర్వాదం పొందారు. దేవరకద్ర మండలం డోకూర్ గ్రామ శివారులోని తపోవన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ తమ హాల్ టికెట్లను స్వామివారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాసులు, పావని, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని రైతుల ధర్నా



**వేద న్యూస్, దేవరకద్ర:**

లో వోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతులు కౌకుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు నిరసన ధర్నా నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు గురువారం వెంకటగిరి, ఇసరంపల్లి, పేరూరు గ్రామాల రైతులు రైతు సంఘం అధ్యక్షుడు కొండారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పేరూరు సబ్‌స్టేషన్ ద్వారా సరఫరా అవుతున్న త్రీఫేజ్ కరెంట్ సరిగా అందడం లేదని, లో వోల్టేజ్ కారణంగా పంటలకు నీరు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ఏఈ వెంటనే సబ్‌స్టేషన్‌కు వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఈ ఫోన్ ద్వారా మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఏఈడీ రైతులతో మాట్లాడుతూ పేరూరు సబ్‌స్టేషన్‌లో లో వోల్టేజ్ సమస్య ఉన్నదని, అవసరమైన మెటీరియల్ వచ్చిందని, రేపటిలోగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తరువాత రైతులు సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేసి, అనంతరం కౌకుంట్ల తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పి. శివారెడ్డి, రాజేందర్ రెడ్డి, ఎల్. శ్రీనివాస్ రెడ్డి, పి. రాజేశ్వర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లేష్, బాల్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కే. రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమీక్ష
- వైద్య సిబ్బందితో సమీక్ష



**వేద న్యూస్, జడ్చర్ల:**

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న సదుపాయాలు, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, అత్యవసర సేవల పరిస్థితి తదితర అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. ప్రత్యేకంగా గర్భిణీలు, వృద్ధులు మరియు అత్యవసరంగా వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించడంతో పాటు రోగులకు అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. మార్చురీ గది పరిశీలించిన ఎమ్మెల్యే జడ్చర్ల వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన మార్చురీ గదిని ఎమ్మెల్యే పరిశీలించారు. మృతదేహాలను భద్రంగా ఉంచేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమర్థంగా పనిచేయాలని తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ఆటోడ్రైవర్



**వేద న్యూస్,కారేపల్లి :**

డబ్బు చుట్టూ లోకం తిరుగుతున్న ఈ రోజుల్లో రూపాయి కనిపిస్తే వదులుకోని మనుషుల మధ్య, తానొక భిన్నమైన మనిషినని నిరూపించుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. తన ఆటోలో ప్రయాణికుడు మర్చిపోయిన విలువైన సెల్‌ఫోన్‌ను వెతికి మరీ అప్పగించి, మానవత్వం ఇంకా బతికే ఉందని చాటిచెప్పాడు. గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన ఆంగోత్ రాజు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. అతను ప్రతిరోజూ మాదారం నుండి ఇల్లెందు వరకు ప్రయాణికులను చేరవేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో, ఇల్లెందులో దిగిపోయిన ఒక ప్రయాణికుడు తన ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఆటోలోనే మర్చిపోయాడు.

వెంటనే స్పందించిన రాజు

ప్రయాణికుడు దిగిపోయిన కాసేపటికి ఆటోలో ఫోన్ ఉండటాన్ని రాజు గమనించాడు. "ఎవరో కష్టపడి కొనుక్కున్న వస్తువు.. పోతే వాళ్ళు ఎంత బాధపడతారో" అని భావించిన ఆయన, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ ప్రయాణికుడి కోసం గాలించాడు. చివరికి అతడిని గుర్తించి, పిలిచి మరీ ఆ ఫోన్‌ను సురక్షితంగా చేతికి అందించాడు.

# 'ఇందిరమ్మ ఇళ్ల 'పై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**వేద న్యూస్, జడ్చర్ల:**

జడ్చర్ల మున్సిపాలిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో ఈ పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనం పూర్తిగా చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈ, ఏఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానలో ప్రజా పాలన కార్యక్రమం

- పారిశుధ్యం, ఆరోగ్య పరీక్షల శిబిరం
- పాల్గొన్న ఎమ్మెల్యే డా. కుచ్చుకుళ్ల రాజేష్ రెడ్డి



**వేద న్యూస్, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ పట్టణంలోని 18వ వార్డులో గల బస్తీ దవాఖానలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుధ్య కార్యక్రమం మరియు ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కుచ్చుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పేదలకు దగ్గరలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు మరియు స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అలాగే బస్తీ దవాఖాన పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు సునీత శ్రీనివాస్ గౌడ్, చంద్రకళ శ్రీనివాసులు, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 99 రోజుల యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**వేద న్యూస్, నాగర్ కర్నూల్:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన తెలంగాణే లక్ష్యం

- చైర్మన్ దమయంతి



**వేద న్యూస్, దేవరకద్ర:**

ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన – 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వివిధ వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ శిబిరంలో 531 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శశికాంత్, తహసీల్దార్ దీపిక రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డా. శరత్ చంద్ర, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వైద్య శిబిరం ప్రారంభం



**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బిలకంటి వెంకట్రాములు–వెంకటాముల దంపతుల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిబిరాన్ని బిలకంటి వెంకట్రాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్వ కన్నయ్య శెట్టి, ప్రధాన కార్యదర్శి గుద్దటి చంద్రయ్య, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్, దశరథ, గిరిశంకర్, నరేష్, అర్జున్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

మైనారిటీ మహిళలు ఆర్థికంగా నిలదొక్కు కోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను, అలాగే మండలంలోని మస్జిద్ కమిటీలకు 350 రంజాన్ తోఫా గిఫ్ట్ ప్యాకెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో సుమారు 200 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామని, మహిళలు తమ నైపుణ్యంతో సంపాదన పెంచుకున్నప్పుడే కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే మైనారిటీల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ సర్వమత సౌభ్రాతృత్వం కోసం ప్రార్థించడం అభినందనీయమన్నారు. అల్లా దీవెనలతో మైనారిటీ సోదరుల కోరికలు నెరవేరాలని ఆయన కోరారు.

# సిద్ధాంతమే పునాది..కార్యకర్తలే మన బలం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:** – గంట రవికుమార్





వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలో నిర్వహించిన "పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణ మహా అభియాన్" మండల స్థాయి శిక్షణా శిబిరంలో ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన ఏకాత్మ మానవవాద సిద్ధాంతమే మన మార్గదర్శి అన్నారు. వ్యక్తి, సమాజం మరియు దేశం పరస్పర అనుసంధానంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం, సమాజంలో చిట్టచివరి వ్యక్తికి ఫలాలు అందాలనే 'అంత్యోదయం' లక్ష్యంగా మన ప్రతి నిర్ణయం ఉండాలి తెలిపారు. కార్యకర్త అంటే కేవలం ఓట్లు సేకరించే వ్యక్తి కాదు, సమాజంలో విలువలను ప్రతిష్ఠించే ఒక చైతన్య శక్తిగా మారాలన్నారు. క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధత, మరియు సామాజిక బాధ్యత అనే ఈ మూడే మన పార్టీని బలంగా నిలబెట్టే స్తంభాలని, పార్టీ నిర్మాణం కేవలం ఒక రాజకీయ వ్యవస్థ కాదు, అది ఒక చైతన్యవంతమైన ఆలోచనా ధార. సిద్ధాంత స్పష్టతతో, సేవాభావంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు. సిద్ధాంత బలం ఎక్కడ ఉంటే.. స్థిరమైన విజయం అక్కడే సాధ్యమవుతుందని నాయకులకు, కార్యకర్తలకు వివరించారు. పాశ్చాత్య విధానాల కంటే భారతీయ మూలాలను అర్థం చేసుకుని, ఆత్మనిర్భర భారత్ (స్వావలంబన) దిశగా పయనించాలని ఆయన బోధించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, ప్రశిక్షణ అభియాన్ కో–కన్వీనర్ కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి కపిల్ కుమార్, జిల్లా ఐటి ఇంచార్జ్ ఆడెపు వెంకటేష్, జిల్లా మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, మండల అధ్యక్షులు తాళ్లపెల్లి అర్జున్, ప్రశిక్షణ మండల కన్వీనర్ గోళ్ళ రాజ్ కుమార్, జిల్లా, మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**వేద న్యూస్, దేవరకద్ర:**

ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అనంత మారుతి గార్డెన్స్‌లో సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 99 రోజుల కార్యాచరణను ఐదు దశల్లో అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073